

కుర్చీలే తోపుడు బండ్లు..

కలెక్టరేట్‌లో ఒక గది నుంచి మరో గదికి.. ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి ఫైళ్లు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే, అవి పెద్ద మొత్తంలో ఉండడంతో వాటిని మోయడం సిబ్బందికి కష్టంగా మారింది. దీంతో వారికి కొత్త ఆలోచన వచ్చింది. అన్నన్ని ఫైల్స్‌ను మోసుకెళ్లడం ఎందుకని.. వాటిని వీల్‌చైర్లలో వేసుకొని ఎంచక్కా తోసుకుంటూ వెళుతున్నారు. సోమవారం ఈ పరిస్థితిని చూసిన వారు వాట్ ఎన్ ఐడియా సర్‌జీ అంటూ చర్చించుకోవడం కనిపించింది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా



అంబరాన్నంటిన తీజ్ సంబరాలు

తలకొండపల్లి, ఆగస్టు 5 : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన తీజ్ వేడుకలను తలకొండపల్లి మండలం పడమటి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లగుట్ట తండాలో సోమవారం అట్టహాసంగా జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతాలలో ఉన్న తండావాసులు, బంధువులు వేలాదిగా తరలి రావడంతో తాళ్లగుట్ట తండా జనసంద్రమైంది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వేడుకల్లో పాల్గొని గిరిజన యువతులకు మొలకలను అందజేసి తీజ్ శుభాకాంక్షలు తెలిపారు. తీజ్ వేడుకల్లో యువతీ,యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజనుల సహజ వేషదారణతో చిన్నారులు , యువతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి తమ ఆచార వ్యవహారాల ప్రకారం పెంచిన మొలకల బుట్టలను స్థానిక ముత్యాలమ్మ, తుల్జాభవాని, మేరమ్మయాడి, సేవాలాల్ ఆలయాలలో ఉంచి పూజలు చేశారు. అనంతరం పెళ్లికాని యువతులు, చిన్నారులు పట్టు వస్త్రాలు ధరించి మొలకల బుట్టలనెత్తుకొని తండాలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మొలకల బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బుజ్జికృష్ణ, రమేశ్ యాదవ్, నాయకులు దేవులానాయక్, గోపాల్‌నాయక్, సురేందర్‌రెడ్డి, పాండునాయక్, రతన్, కిషన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల బారిన పడొద్దు

- పారిశుధ్య లోపం వల్లే విషజ్వరాలు
- కలెక్టర్ శశాంక



ఇబ్రహీంపట్నంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శశాంక, ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 5: సీజనల్ వ్యాధుల బారినపడకుండా పారిశుధ్యం విషయంలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శశాంక అన్నారు. పారిశుధ్య లోపంతోనే అనేక మంది ఇన్‌ఫెక్షన్లు సోకి విషజ్వరాలు, డెంగీ, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులకు గురవుతున్నారన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వీటికి దూరంగా ఉండొచ్చన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సోమవారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇక్కడ మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో మొక్కలు నాటారు. విద్యార్థులు, మున్సిపల్ సిబ్బందితో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో నిత్యం చెత్తను తొలగించడం, మురుగును శుభ్రం చేయడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా మసలుకోవాలన్నారు. కొవిడ్ నుంచి పారిశుధ్యం విషయంలో కొంత అప్రమత్తం అయినప్పటికీ ఇంకా మార్పు రావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో అడవులు 33 శాతం ఉండాల్సి ఉందని ప్రస్తుతం 24 శాతమే ఉన్నాయన్నారు. దీనిని అధిగమించేందుకు ప్రతీ ఒక్కరు కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులు దీనిని ఆచరణలో పెట్టడంతో పాటు ఇరుగు పొరుగును చైతన్యం చేయాలని సూచించారు. వాతావరణ సమతుల్యతను కాపాడుకోకుంటే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందనేది గుర్తెరగాలన్నారు. ఈ సందర్భంగా వేతనాలు పెంచాల్సిందిగా అవుట్ సోర్సింగ్ కార్మికులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.అనంతరెడ్డి, తహసీల్దారు సునీతారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ రవీందర్‌సాగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూపాల్‌రాజు, కౌన్సిలర్లు ఆకుల మమత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



కనకమామిడి సంగమేశ్వరాయలంలో భక్తులు

ఆలయాల్లో 'శ్రావణ' పూజలు

మొయినాబాద్, జులై 5: మండలంలోని కనకమామిడిలో గల భ్రమరాంబ సంగమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులతో ఆలయం సందడిగా మారింది. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ నెల 12న సోమవారం సహస్ర కలిషాభిషేకం, 19న పుష్పార్చన, 26న అమ్మవారికి శ్రీచక్ర కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

మానవ అక్రమ రవాణా నిర్మూలన
అందరి బాధ్యత

- సీడీపీవో నాగమణి

కొందుర్గు, ఆగస్టు, 5: మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని షాద్‌నగర్ సీడీపీవో నాగమణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్, ప్రజ్వల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో డాక్టర్ లక్ష్మీఅనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అతిపెద్ద నేరమని, ప్రతిరోజు ఎంతో మంది మహిళలు, అమ్మాయిలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. పేద, మధ్య తరగతికి చెందిన మహిళలు, అమ్మాయిలు ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారన్నారు. దీనిపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. చిన్నారులకు చాకెట్లు ఆశ చూపి వారిని తీసుకువెళ్తున్నారని, వీటిపై జాగ్రత్తగా ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. మండల వైద్యాధికారి అమృతా జోసఫ్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లి ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తప్పని సరిగా తల్లి పాలివ్వాలని చెప్పారు. దీని ద్వారా చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ కుమార్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్, మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, జయలక్ష్మి, శివరాణి, మీనా, స్వరూప, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు తీర్చండి అంటూ అర్జీలు పట్టుకొని వారం వారం కలెక్టరేట్‌కు వస్తున్నం. అర్జీలు ఇస్తున్నం. కానీ, ఎక్కడ ఏసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉన్నాయి మా కష్టాలు అంటూ వాపోతున్నారు అర్జీదారులు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించి ఎన్నో కష్టాలు పడి కూలి పనులు వదులుకొని వచ్చి అధికారులకు విన్నవించినా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అవి ఏ స్థాయిలో ఉన్నాయో కూడా అర్థం కావడం లేదని వాపోతున్నారు. అయినా, ఆశ చావక మళ్లీ మళ్లీ వస్తున్నామని చెబుతున్నారు. వీరి సమస్యలు ఎప్పటికి పరిష్కారం అవుతాయో ఆ అధికారులకే తెలియాలి.



కలెక్టరేట్‌లో బారులు తీరిన ప్రజలు

'ప్రజావాణి'లో అపరిష్కృతంగా సమస్యలు

- వినతులు స్వీకరిస్తున్నారు.. వదిలేస్తున్నారు
- నిరాశ చెందుతున్న అర్జీదారులు
- మళ్లీ మళ్లీ అధికారులకు అర్జీలు ఇస్తున్న వైనం

తిరుగుడు తప్ప తీరుత లేవు!

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 : గ్రీవెన్స్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయనుకుంటున్న ప్రజలకు నిరాశే మిగులుతోంది. పై స్థాయి అధికారులకు ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలు విన్నవిస్తే తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశ బాధితుల్లో కలగడం లేదు. తమ సమస్యలు పరిష్కరించాలని మళ్లీ మళ్లీ ప్రజావాణికి వస్తున్నారు. తమ సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం కాకపోవడంతో కలెక్టర్‌కు తమ గోడును వినిపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయనే గంపడాశతో వస్తున్నా నిరాశే ఎదురవుతోంది. కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్నా అవి పరిష్కారానికి నోచుకోకపోవడంతో అదే సమస్యతో బాధితులు మళ్లీ మళ్లీ వస్తున్నారు. అయినా, ఆర్జీల్లో చాలావరకు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మొదట్లో ఫిర్యాదులు అధిక సంఖ్యలో రావడంతో మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. అక్కడ పరిష్కారం కానివి మాత్రమే కలెక్టరేట్‌కు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమం సక్సెస్ కాకపోవడంతో మళ్లీ ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా నిర్వహిస్తున్నారు. అయితే, నాలుగైదు సార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా.. సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఫిర్యాదుదారులు ఇచ్చే వినతులు స్వీకరించి వాటిని గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టాదారు పాస్‌బుక్ రాకపోవడం, భూమి కొలతలకు చాలాన్లు చెల్లించి నెలల తరబడి వేచి చూసినా సర్వేయర్లు వచ్చి హద్దులు చూపకపోవడం, పాస్‌బుక్‌లో పేర్లు తప్పుగా రావడం, పట్టాభూమిని ఇనాం భూమిగా చూపడం, భూమి తక్కువ, ఎక్కువ చేసి చూపడం, తండ్రి, తల్లి, చనిపోతే వారి పేరుపై ఉన్న భూమి వారసుల పేరిట మార్చేందుకు తిప్పలు పెట్టడం, పింఛన్, డబుల్ బెడ్‌రూం, రేషన్ కార్డు వంటి వాటిపై ఎక్కువగా విజ్ఞప్తులు వస్తున్నాయి. దూర ప్రాంతంలో ఉన్న కలెక్టరేట్‌కు ఒకసారి వచ్చేందుకు కనీసం రూ. వేయి నుంచి రెండు వేల వరకు ఖర్చవుతుందని బాధితులు వాపోతున్నారు. అధికారులు మారినప్పుడల్లా ఫైల్స్ రిటన్ పంపిస్తున్నారని, దీంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని బాధితులు వాపోతున్నారు. అయితే, కొందరు చేసిన పరిష్కారం నచ్చక, మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని మళ్లీ మళ్లీ వస్తున్నారని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

అన్ని చోట్లకూ తిరిగా..



కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. నా సమస్య పరిష్కారం కావడం లేదు. నేను చేవెళ్ల మండలం ఖానాపూర్‌లోని సర్వేనెంబర్ 26/అ, 27/ఇలో మొత్తం 15.20 ఎకరాల భూమిని చింతలపేట అనుసూజ, స్వరూపల నుంచి 2013లో కొనుగోలు చేశాను. మా నాన్న ఆరోగ్యం బాగాలేదని సమాచారం రావడంతో నేను బెంగుళూరు వెళ్లాను. మ్యూటేషన్‌కు పెట్టుకోలేదు. కొన్నాళ్ల తర్వాత భూమి వద్దకు వెళ్లాను. భూమి అమ్మిన రైతులు కబ్జాకు రానివ్వలేదు. తక్కువ ధరలలో కొన్నావు.. ఇప్పుడు ధర పెరిగింది. భూమి ఇవ్వమని చెప్పారు. పంచాయతీ పెట్టితే 5 ఎకరాలు తిరిగి ఇచ్చేశాను. మిగతా భూమికి కబ్జా ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. నాకు అమ్మిన భూమిని మరికొందరికి రిజిస్ట్రేషన్ చేయించారు. నాకు న్యాయం చేయాలని మండల అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. కలెక్టరేట్‌లోని ప్రజావాణికి మూడుసార్లు, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఒకసారి అర్జీ ఇచ్చినా ఫలితం లేదు.

శెట్టి శ్రీనివాస్, మెహిదీపట్నం

ప్రజావాణికి పదిసార్లు వచ్చా..



ప్రజావాణికి ఇప్పటికి పదిసార్లు వచ్చా..! వచ్చినప్పుడల్లా రెండు వేలు ఖర్చవుతున్నాయి. కలెక్టరు ఆఫీసుకు రానికే బస్సులు లేవు. మా నాన్నకు రాల్సిన భూమి గురించి హైకోర్టులో కేసు వేశాం. మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు అమలు చేయడం లేదు. నాకు న్యాయం చేయాలని కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఇప్పటి పలుమార్లు వినతులు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో మా నాన్న బెంగతో మంచం పట్టాడు.

మల్లేఖేడి శివాజి, అన్నారం, ఫరూక్‌నగర్ మండలం

ఎన్నిసార్లు వచ్చినా ఫలితం లేదు



తాతల నాటి మా భూమికి కొందరు కబ్జా చేసి అమ్ముకున్నారు. కందుకూరు మండలం దాసర్లపల్లి శివారులో 57-13 ఎరాల భూమికి మా తాతలు పట్టాదారులు. 2006లో వచ్చిన కరువుతో మేమంతా ఊరు విడచి నాగర్‌కర్నూల్ జిల్లాకు బతుకు దెరువుకోసం వెళ్లాము. ఈ సమయంలో కొంత మంది మా భూమిని కబ్జా చేసి, ధరణిలో పేర్లు మార్చి భూమిని అమ్మేశారు. దీంతో నాకు న్యాయం చేయాలని పలుమార్లు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నాము. ఇప్పటికీ పరిష్కారం కాలేదు.

వంకుడవత్ బిల్యా, దాసర్లపల్లి, కందుకూరు మండలం



ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించండి : డీఆర్వో

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డీఆర్వో సంగీత అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. సోమవారం ప్రజావాణికి 180 ఫిర్యాదులు అందినట్లు ఆమె చెప్పారు.

కాటేస్తున్న కత్తెర పురుగు!



వనంపల్లిలో పురుగు మందు పిచికారి చేస్తున్న రైతు

చౌదరిగూడ, ఆగస్టు 5: మొక్కజొన్న పంటను లద్దె పురుగు జాతికి చెందిన కత్తెర పురుగు కాటేస్తుంది. దీంతో పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌదరిగూడ మండలంలో పత్తికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు పంటల ఏపుగా పెరుగుతున్న దశలో పంటకు వేరుకుళ్లు తెగులు సోకి ఎండిపోతుంది. దీంతో రైతులు పంటకు అనేక రసాయనిక మందులను పిచికారి చేసి పంటకు ఒక రూపం తీసుకు వచ్చారు. అయితే, ఇప్పుడు మళ్లీ కత్తెర పురుగు వెంటాడుతుంది. ఈ సీజన్‌లో మొక్కజొన్న పంటలో తెగులు అధికంగా వ్యాపిస్తుందని రైతులు తెలుపుతున్నారు. పురుగు మొక్కజొన్న చెట్టు కాండం లోపలికి ప్రవేశించి కాండం లోని గుజ్జుతో పాటు ఆకులను కూడా వదలకుండా తినేయడంతో పంట ఎదుగుదల లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సమస్యగా మారిందని, ఆ సమస్య ఇంకా వదలడం లేదని వాపోతున్నారు.



లద్దె పురుగు తినేసిన మొక్కజొన్న కాండం

పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం

కత్తెర పురుగు పంటకు తీవ్ర నష్టం కల్గిస్తుంది. అంతే కాకుండా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పుడు వ్యాపించిన కత్తెర పురుగు మొక్కజొన్న కంకులు వేసే వరకు పంటపై వ్యాపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగు తీవ్రత ఇలాగే ఉంటే పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు దిగాలు పడుతున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 3,600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయగా అందులో చాలావరకు కత్తెర పురుగు ఆశించిందని రైతులు చెబుతున్నారు.



మొక్కజొన్న ఆకుపై కత్తెర పురుగు

కత్తెర పురుగు నివారణ చర్యలు

కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను చుంచు దశలో ఉన్న పంటకు 3 కేజీల గుళికలు ఎకరానికి 3 కిలోలు చొప్పున సుడిలో మందులను వేసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు క్లోరీఫైరిఫాస్ 400 ఎంఎల్, క్వినాల్‌పాస్ 400 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి మధ్యస్థ దశలో ఉన్నప్పుడు ఇమామెక్టిమ్ బెంజయోట్ 80 గ్రాములు సైపనోఫాస్ 60 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉంటే క్లోరాంత్రనిలో పోల్ 60 ఎంఎల్, లాంసైలోతిన్ 200 ఎంఎల్ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఆధికంగా ఉంటే పాల్ ఆర్మీహోం, కోరాజీన్ 60 ఎంఎల్, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. బేంజర్ 0.5 ఎమ్ఎల్ పర్ లీటర్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే పురుగు నివారణను తగ్గించవచ్చని మండల వ్యవసాయాధికారి కృష్ణమోహన్ తెలిపారు.

మందులు చల్లినా తగ్గడం లేదు



రెండు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశా. పంటలో కత్తెర పురుగు అధికంగా ఉంది. పురుగులు మొక్కజొన్న కర్రలను పూర్తిగా తినేస్తున్నాయి. ఇప్పటివరకు ఒకసారి మందు పిచికారి చేసినా పురుగు తగ్గడం లేదు.

శ్రీనివాస్‌రెడ్డి , రైతు, ఎదిర, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

ఎరువులను మోతాదులో వేసుకోవాలి

పంటలకు తేమశాతం ఉన్నప్పుడే పంటలకు పైపాటుగా సరైన మోతాదులో రైతులు ఎరువులు వేసుకోవాలి. పత్తి పంటలో ఎర్ర గుమ్మడి తేగులు సోకితే 19-19-19 పిచికారి చేసుకోవాలి. పంటలను ఆశించే పురుగుల నివారణకు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి తెగుళ్ల బారి నుంచి బయట పడాలి.

- కృష్ణమోహన్, మండల వ్యవసాయాధికారి



మోమిన్‌పేట్ డిప్యూటీ తహసీల్దార్‌గా సురేశ్‌కుమార్

మోమిన్‌పేట్, ఆగస్టు 5: మోమిన్‌పేట్ డిప్యూటీ తహసీల్దార్‌గా సురేశ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొడంగల్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన సురేశ్‌కుమార్ బదిలీపై మోమిన్‌పేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులు, ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించొద్దని అన్నారు.






వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం



ఆలయ అభివృద్ధి నమూనాను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

కొడంగల్, ఆగస్టు 5: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే పలుమార్లు టీటీడీ, దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించగా తాజాగా సోమవారం మరోసారి పరిశీలన చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానంగా నిత్య పూజలందుకుంటున్న కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి టీటీడీ డీఈ నాగరాజు, ఏఈఈ జయలక్ష్మి, అసిస్టెంట్ ఏఈ రవికాంత్‌తో పాటు ఏఈ తుకారం, శివశంకర్, ఈవో నరేందర్ తదితరులు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, గోపురాలు తదితర వాటిపై నివేదికలు తయారు చేసిన నమూనాను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిపరిచే విధంగా ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాల్లోని వరాహస్వామి, మాడవీధులు, గోశాల తదితర వాటిని పరిశీలించి అభివృద్ధికి కావాల్సిన వివరాలను సేకరించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇరువైపులా, ముందు భాగంలో ఉన్న ఇళ్లను తొలగిస్తూ దాదాపు ఆరు ఎకరాల స్థలంలో తిరుపతి తరహాలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు ఆలయ పరిసరాల్లోని ఇంటి వివరాలను సేకరించి వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో తుది నివేదికతో స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ నిర్మాణ పనులకు పూజలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, మధు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.























స్పీకర్, మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

వికారాబాద్, ఆగస్టు 5: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. వికారాబాద్‌కు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని జర్నలిస్టుందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని, జిల్లా రిపోర్టర్లకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కోరారు. అంతేకాకుండా హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు పెద్దలు గిరీశ్వర స్వామి, మహమ్మద్ షఫీ, మహేష్, నరేష్, సత్యం, మహేందర్, వెంకట్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీకేలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అహ్మద్‌గూడ ఆర్జీకే కాలనీ వాసులు

కీసర రూరల్, ఆగస్టు 5: రాజీవ్ గృహకల్ప(ఆర్జీకే) కాలనీలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో జీప్లస్ త్రీ మాడల్‌లో 141బ్లాకుల్లో మొత్తం 4512ఇళ్లను నిర్మించి, ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసిందన్నారు. కాగా ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ లేకపోవటంతో ఎవరికి తోచినట్లు వారు దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ఇది చాలదన్నట్లుగా జీప్లస్‌త్రీలో నిర్మించిన ఇళ్ల గోడలను తొలగించి మరీ షట్టర్లను ఏర్పాటు చేసుకుంటున్నారని, పై అంతస్తుల్లో నివాసముంటున్న వారు తమ ఇళ్లల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. గోడలు పగులగొట్టడంతో భవన నాణ్యత దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేస్తున్న దుకాణ సముదాయాలను తొలగించటంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతరాజు రాములు, సిరిసిల్ల శంకరయ్య, సందీప్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం బహిష్కరణ

తమ గ్రామాలను యాదాద్రి-భువనగిరిలో కలపొద్దని డిమాండ్



అంకుశాపూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్న విలీన గ్రామాల ప్రజలు, నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 5: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం ప్రజలు బహిష్కరించారు. మండలంలోని అంకుశాపూర్‌లో సోమవారం స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. డీపీవో, డీఆర్‌డీవో, డీఎల్‌పీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో కార్యక్రమానికి హాజరై ప్రారంభిస్తుండగా ప్రజలు, నాయకులు తమ గ్రామాలను యాదాద్రీ-భువనగిరి జిల్లాలో విలీనం చేయొద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికారులను చుట్టుముట్టి కార్యక్రమం నిర్వహించకుండా అడ్డుకున్నారు. తమ గ్రామాలను ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో గానీ జీహెచ్ఎంసీలో గానీ విలీనం చేయాలేగానీ, యాదాద్రీ జిల్లాలో ఎలా కలుపుతారని అధికారులను నిలదీశారు. ఆ జిల్లాలో కలిపితే తాము ఉనికిని కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి జిల్లాలో విలీనం చేస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టి జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. డీపీవో వెంకయ్య, డీఆర్‌డీవో సాంబశివరావులు నచ్చజెప్పినా గ్రామస్థులు వినిపించుకోలేదు. మధ్యాహ్నం వరకూ గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించరాదని అధికారులను డిమాండ్ చేశారు. డీఎల్‌పీవో సాంబిరెడ్డి, తహసీల్దారు డీఎస్ రజిని, ఎంపీడీవో గీతారెడ్డి, ఏవో బాసిత్, ఏపీఎం తౌర్యానాయక్, నాయకులు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కరుణాకర్, మత్స్యేందర్‌రెడ్డి, మహేష్, మంగారెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్: తమ మూడు గ్రామాలను యాదాద్రీ జిల్లాలో కలపొద్దని సోమవారం అవుషాపూర్, అంకుశాపూర్, మాధారం గ్రామాల జేఏసీ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమను యాదాద్రి జిల్లాలో కలిపితే భవిష్యత్తుకే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు తమ గ్రామాలను అందులో కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని విలీనగ్రామాల జేఏసీ నాయకులు కోరారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పన్నాల కొండల్‌రెడ్డి, వామన్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, ఎల్సాని అయిలయ్య, శోభారాణి, మాదవారెడ్డి, బిక్షపతిగౌడ్, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బద్దం నర్సింహారెడ్డి, వేణు పాల్గొన్నారు.

రూ.44కోట్లతో వికారాబాద్ జిల్లాలో 11 కొత్త సబ్‌స్టేషన్లు

- జిల్లాలో మొత్తం 3లక్షల 32వేల విద్యుత్ కనెక్షన్లు
- 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- రూ.33కోట్ల పెండింగ్ బిల్లులు
- జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి



జినుగుర్తి సబ్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి

తాండూరు రూరల్, ఆగస్టు 5: వికారాబాద్ జిల్లాలో నేరుగా విద్యుత్ సరఫరా చేసి లోవోల్టేజీ సమస్య తీర్చేందుకు కొత్తగా 11 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. వాటిలో మూడు సబ్‌స్టేషన్లు స్థలం లేక పనులు ఆగిపోయాయని, మిగతా ఎనిమిది సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జినుగుర్తిలో సోమవారం 33/11కేవీ ప్రారంభం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మోమిన్‌పేట్ మండల కాసారం వికారాబాద్ న్యూ కలెక్టరేట్, ధారూర్ మండలం గోదంగూడ, కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి, బొంరాస్‌పేట్ మండలం లాగచర్ల, కొడంగల్ మండలం హస్నాబాద్, దోమ మండలం కిష్టాపూర్, కుల్కచర్ల మండలం కుసుమ సముద్రం, వికారాబాద్ మండలం నారాయణపూర్, కొత్తఘడి, మర్పల్లి మండలం పట్లూరు ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.4కోట్ల చొప్పున రూ.44కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో సబ్‌స్టేషన్‌లో 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి 5 నుంచి 6 గ్రామాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.33కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తాండూరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో రూ.16కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. జీరో బిల్లు కొంతమందికి రాలేదని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ప్రజాపాలనకు దరఖాస్తు చేసే సమయంలో రేషన్‌కార్డుతోపాటు రేషన్‌కార్డు ఇవ్వకపోవడం, ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఉండటం వంటి విషయాలను డాటా ఎంట్రీలో నమోదు కాలేక గృహజ్యోతి కొందరికి రాలేదన్నారు. అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. కొంతమంది లైన్‌మెన్‌లు నెలరోజులు దాటినప్పటికీ బిల్లులు ఇవ్వడంలేదని విలేకరులు ప్రశ్నించగా లైన్‌మెన్‌లు అంతా 30రోజుల్లోపు బిల్లులు ఇవ్వాల్సి ఉంటుందని, వారికి ఆదేశాలు జారీచేశామని తెలిపారు. ఈ సమావేశంలో డీఈ భానుప్రసాద్, ఏడీ ఆదినారాయణ, మండల ఏఈ కె.వెంకట్ నాయుడు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించాలి



చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూన్న డాక్టర్ వి.శ్రీకాంత్

మొయినాబాద్, ఆగస్టు 5: వర్షాకాలంలో విష కీటకాలు గ్రామాలతో పాటు కళాశాలలు, పాఠశాలల్లో సంచరిస్తూ మనుషుల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు విద్యార్థులు ఆరోగ్య సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించాలని నగరంలోని టీఎక్స్ హాస్పిటల్స్ సీఓఓ డాక్టర్ వి.శ్రీకాంత్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం ఫార్మసీ, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో 'హెల్త్‌కేర్ డెలివరీ సిస్టమ్ ఇన్ ఇండియా' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ వి.శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆరోగ్యసంరక్షణ విభాగంలో అవకాశాలపై వివరించారు. విష కీటకాలను అరికట్టేందుకు అవసరమైన ఆధునిక విధానాలను కనుగొనేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఆరోగ్య సంరక్షణ విభాగంలో వచ్చే అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, శంకర్‌లింగం, పవన్‌కుమార్, రాజు, ఫార్మసీ హెచ్‌ఓడీ కుమారస్వామి అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సుధాకర్

నేడు ఆమనగల్లులో గద్దర్ వర్ధంతి

ఆమనగల్లు, ఆగస్టు 5: ప్రజా గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ పూలే జ్ఞాన జాతర రాష్ట్ర కో-ఆర్డినేటర్ జీ.సుధాకర్ తెలిపారు. ఆమనగల్లులో సోమవారం గద్దర్ వర్ధంతి సభ కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నేటి ఉదయం 11గంటలకు ఆమనగల్లులోని రాజీవ్ చౌక్‌వద్ద నిర్వహించే వర్ధంతి సభకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మహనీయుల గళం మాస్టర్ జీ, దళిత ప్రజాసంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. గద్దర్ జీవిత చరిత్రను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమానికి కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు, పూలే, అంబేడ్కర్ వారసులు, దళిత, ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలోబిక్షపతి, రఘురాములు, రామన్‌గౌడ్, యాదయ్య, రాములు, అంజయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

శంషాబాద్, ఆగస్టు 5: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు శంషాబాద్‌లో మహార్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్‌మెంట్స్ వెంటనే చెల్లించాలన్నారు. విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు పృథ్వీతేజ మాట్లాడుతూ.. ఏడువేల కోట్ల స్కాలర్‌షిప్‌లను చెల్లించాలన్నారు. ప్రతీ విద్యార్థులకు రూ.10వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఫీజు దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమానికి ముందు బస్టాండ్, మహావీర్ బిల్డర్స్, మధురానగర్‌ల గుండా మహార్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్, మణికంఠ, ప్రదీప్, చరణ్, భరత్, శివ, పవన్, తిరుపతి, అఖిల్, మనీష, ప్రీతి, అనూష, భార్గవ్, మేఘన పాల్గొన్నారు.

పిల్లలకు మెదడువాపు నివారణ వ్యాక్సిన్ వేయించాలి



చేవెళ్లలో పిల్లలకు వ్యాక్సిన్ వేయిస్తున్న అధికారులు

చేవెళ్ల, ఆగస్టు 5: మెదడువాపు నివారణ టీకాలు పిల్లలకు వేయించాలని చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిని విజయలక్ష్మి తెలిపారు. సోమవారం చేవెళ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు మెదడువాపు నివారణ జేఈ వ్యాక్సిన్ వేయించారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలందరికీ జేఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, మాజీ సర్పంచ్ శైలజ, పీఎస్ రాఘవేందర్, అంగన్‌వాడీ టీచర్లు ప్రవీణ, ఉమారాణి, ఆశా, ఐకేపీ వర్కర్లు పాల్గొన్నారు.

రద్దీకనుగుణంగా బస్సులు నడపాలి



బస్సుకోసం రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

మంచాల, ఆగస్టు 5: ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.యాదయ్య ఆర్టీసీ అధికారులను కోరారు. సోమవారం చెన్నారెడ్డిగూడ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి రాస్తారోకోలో పాల్గొన్నారు. యాదయ్య మాట్లాడుతూ చెన్నారెడ్డిగూడకు ఉదయం బస్సు ట్రిప్పు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం 7గంటలకు అజినాతండా నుంచి వచ్చే బస్సు బండలేమూర్‌లోనే ప్రయాణికులతో కిక్కిరిసిపోతోందని, బస్సులో స్థలం సరిపోక చెన్నారెడ్డిగూడ విద్యార్థులు ఎక్కలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆ తర్వాత ఇంకో బస్సు కోసం ఉదయం 10గంటలదాకా వేచి ఉండాల్సిందే అన్నారు. అప్పటికే స్కూళ్లు, కాలేజీల సమయం అయిపోతుందన్నారు. సమస్యపై స్పందించి ఉదయంపూట అదనపు బస్సును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనలో సీపీఎం మండల నాయకుడు పి.వెంకటేష్, చంద్రయ్య, బి.పాండు, సురేష్, పాండు, మోతీలాల్, కృష్ణ, జంగయ్య, ప్రవీణ్, హన్మంతు, కిషన్, విక్రమ్, క్రాంతి, సత్యనారాయణ; వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగిలిగిద్ద కాలేజీలో వసతులు కల్పిస్తాం



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్, గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు5: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కల్పించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ప్రిన్సిపాల్ మంజుల, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్యాంసుందర్, గ్రామస్తులు సోమవారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. స్వీపర్, అటెండర్ లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో స్వీపర్, అటెండర్లను నియమిస్తానని తెలిపారు. కాలేజీకి కంప్యూటర్‌ను ఇప్పిస్తానని తెలిపారు. మూలన పడ్డ మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

'వేద పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా'

వేద పాఠశాల అభివృద్ధికి తన వంతుగా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా కిషన్‌నగర్ శివారులోని జగద్గురు వేద పాఠశాలలో గల కాశీ విశ్వేశ్వరస్వామికి ఎమ్మెల్యే దంపతులు రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో వేద పాఠశాల నెలకొల్పడం సంతోషకర విషయం అన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాశీనాథ్, బసవేశ్వర్, సంఘయ్యస్వామి, వీరేశం, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: నాగిరెడ్డిగూడ గ్రామస్తులతో డీసీపీ శ్రీనివాస్



సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న షీ టీమ్ ఇన్‌చార్జి ఎల్లమ్మ

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మొయినాబాద్, ఆగస్టు 5: యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలనీ రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నాగిరెడ్డిగూడలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ యువత డ్రక్స్, గంజాయి వంటివి జీవితాలను నాశనం చేస్తాయన్నారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుతాయన్నారు. గ్రామాల్లో ఎలాంటి నేరాలు, దొంగతనాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలందరూ సమకరించాలని అన్నారు. కర్యాక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ నర్సింహరాజు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ అర్జున్, మనోజ్‌కుమార్, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లను తెలుసుకొని మసలుకోవాలి

ఆదిభట్ల: విద్యార్థినులు గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్‌లపై తెలుసుకొని జాగ్రత్తపడాలని, సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులకు చెప్పాలని షీ టీమ్ ఇబ్రహీంపట్నం డివిజన్ ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ ఎల్లమ్మ సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కొంగరకలాన్ శ్రీనివాస హైస్కూల్లో 'సైబర్ క్రైమ్, డ్రగ్స్‌తో అనర్థాలు, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్' అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్న విధానాలపై వివరించారు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరి సాయంత్రం ఇంటికి చేరే వరకు జరిగిన ప్రతీ విషయాన్ని తల్లిదండ్రులతో పంచుకోవాలని అన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే 1098కు లేదా 8712662111కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ లక్కరాజు శ్రీనివాసరావు, డైరెక్టర్ రాధిక, షీటీమ్‌సిబ్బంది శ్రీకాంత్, కుమార్ పాల్గొన్నారు.

రెండేళ్లలో అన్ని తండాలకూ బీటీ రోడ్లు



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యువకులు

ఆమనగల్లు, ఆగస్టు 5 : రెండేళ్లలో అన్ని గిరిజన తండాలు, గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించి రవాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమత్తు, ఆధునికీరణపై సోమవారం ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన నివాసంలో పలువురు అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు మండలం శంకర్ గ్రామ పంచాయతీ పరిధి దయ్యాలబోడు తండాకు బీటీ రోడ్డు నిర్మించాలని తండా యువకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కత్వ వాగు నుంచి తండాకు రోడ్డు లేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. త్వరలోనే బీటీ రోడ్డు వేస్తామని కసిరెడ్డి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.180కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. విద్యతోనే సమాజంలో మార్పు, అభివృద్ధి సాధ్యమన్నారు. గిరిజనులు తమ పిల్లలను పాఠశాలలకు పంపి చక్కటి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, విజయ్, శ్రీను, నవీన్, రమేశ్, రాజేశ్, వినోద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' నిరంతర ప్రక్రియ

మొక్కలు నాటే కార్యక్రమం.. పారిశుధ్యంపై అవగాహన ర్యాలీలు



మొక్క నాటుతున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్/యాచారం/శంకర్‌పల్లి/మహేశ్వరం/షాబాద్/కేశంపేట/చేవెళ్ల/చౌదరిగూడ/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మాడ్గుల/కొత్తూర్/కందుకూరు/మొయినాబాద్/నందిగామ/కొందుర్గు, ఆగస్టు 5: 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా చేపడుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. 'స్వచ్ఛదనం.. పచ్చదనం' ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కేవలం అధికారులకు సంబంధించిన కార్యక్రమం కాదని, ఇందులో ప్రజలు భాగస్వాములైతేనే విజయవంతమవుతుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారు ఇంటి ముందు ఇంకుడు గుంత, ఒక మొక్క నాటితే పర్మిషన్లు సులభతరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మున్సిపల్



కొత్తూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రతీ వ్యక్తి విధిగా నాలుగు మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా తీర్చిదిద్దాలని జిల్లా వెల్ఫేర్ అధికారి పద్మజారమణి ప్రజలకు విజ్ఞప్తిచేశారు. యాచారం, గున్‌గల్, తక్కళ్లపల్లితండా గ్రామాల్లో పర్యటించి మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యాచారంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని శంకర్



మహేశ్వరంలో స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీ

పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అన్నారు. టంగటూరు, ఎల్వర్తి, మోకిల, మోకిల తండా గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి హాజరయ్యారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ ప్రాధాన్యంపై వివరించారు. కార్యక్రమంలో టంగటూరు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్, డీపీఎం నిర్మల, ఏపీఎం భీమయ్య, ఏపీవో నాగభూషణం, టంగటూరు మాజీ సర్పంచ్ గోపాల్, సత్యనారాయణగౌడ్, పంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు. శంకర్‌పల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు చంద్రమౌళి, శ్రీనాథ్‌గౌడ్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, తదితరులు ఉన్నారు. మహేశ్వరం, మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ఎంఈవో కృష్ణ, ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం అందరి బాధ్యత అని షాబాద్ మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని 41 పంచాయితీల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. షాబాద్‌లో గ్రామసభ నిర్వహించి, మొక్కలు నాటారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు స్వచ్ఛత, పచ్చదనం కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, ఏపీవో వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. కేశంపేట మండల ప్రత్యేకాధికారి ఏడీఏ రాజారత్నం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని జడ్పీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి ప్రారంభించారు. చెత్తాచెదారం తొలిగించారు. ప్రజలు ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మీర్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, డాక్టర్ నిఖిత, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పంచాయతీల కార్యదర్శులు, యువజన సంఘాల నాయకలు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని చేవెళ్ల ఆర్డీఈవో సాయిరాం తెలిపారు. చేవెళ్లలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలతోనే మానవ మనుగడ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజఆగిరెడ్డి, ఎంపీవో విఠలేశ్వర్, కార్యదర్శి రాఘవేందర్,



నందిగామ: చేగుర్‌లో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ రాజేశ్వర్, సిబ్బంది



షాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి



ఆమనగల్లు ర్యాలీలో స్పెషలాఫీసర్ సుజాత, అధికారులు, ప్రజాప్రతినిధులు



కందుకూరు: గుమ్మడవెల్లిలో స్వచ్ఛదనం-పచ్చదనంపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, అధికారులు

మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ ఉపసర్పంచ్‌లు శ్రీనివాస్, గంగియాదయ్య, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతగా విజయవంతం చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్ద ఎల్కిచర్లలో మొదటి రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదో తేదీనుంచి 9వ తేదీ వరకు గ్రామంలో చేపట్టే పనులను ప్రజలకు వివరించారు. ఇంటి అవరణల్లో నీరు నిల్వ ఉండాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, మహిళా సమాఖ్య సిబ్బంది, ఆశ వర్కలు, గ్రామస్థులు పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలంతా పాలుపంచుకోవాలని ఆమనగల్లు ప్రత్యేక అధికారి సుజాత కోరారు. ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలన్నారు. ఆమనగల్లులో ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత, ఎస్‌ఐ వెంకటేశ్, చైర్మన్ రాంపాల్‌నాయక్‌లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, కృష్ణయాదవ్, చెన్నకేశవులు, సుజాతరాములు, కృష్ణ, లక్ష్మణ్, పాషా, శ్రీధర్, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, ఏపీవో మాధవరెడ్డి, మహిళా సంఘాల సభ్యులు, అంగాన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. పోలెపల్లిలో మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, మాజీ ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ తిరుపతయ్య పాల్గొన్నారు. కడ్తాల, మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కడ్తాలలోని బాలుర పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రత్యేక అధికారి రామేశ్వరి హాజరయ్యారు. ఎంపీడీవో సుజాత, మాజీ జడ్పీటీసీ దశరథనాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఏ పీవో రాజేశ్వరి, ఎంఎన్‌వో జంగయ్య, నరేశ్‌నాయక్, రాజేశ్, రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం లక్ష్యాల పూర్తికి ప్రజలు సహకరించాలని తలకొండపల్లి మండల ప్రత్యేకాధికారి ముత్యాలు అన్నారు. మండల కేంద్రంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించాచారు. మొక్కలు నాటారు. ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీవో రఘు, మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, పాల్గొన్నారు. వెల్జాలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని మొక్కలు నాటారు. ముజుబుర్ రహెమాన్, శరత్, అంబాజీ, అజీజ్, తదితరులు పాల్గొన్నారు. పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని, మొక్కలు నాటి వృక్షాలుగా ఎదిగేంత వరకు సంరక్షించాలని మాడ్గుల ఎంపీడీవో పద్మావతి అన్నారు. మాడ్గులలో ర్యాలీ నిర్వహించారు. జడ్పీ, కస్తూర్బా పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తూర్‌లో మున్సిపాలిటీ కమిషనర్ బాలాజీ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన, పశువైద్యధికారి సూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్ సోమ్లనాయక్, కమ్మరి జనార్ధన్‌చారి, యాదయ్య పాల్గొన్నారు. ఇన్ముల్‌నర్వలో ఎంపీడీవో అరుంధతీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న సమయాల్లో తమ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని కందుకూరు ప్రత్యేక అధికారి వెంకట్, డీఎల్‌పీవో లక్ష్మీనారాయణ కోరారు. ఎంపీడీవో సరితతో కలిసి మండల పరిషత్‌లో పచ్చదనం-పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీలో మాట్లాడారు. ఈ నెల 9 వరకు అన్నిచోట్ల మొక్కలు నాటాలన్నారు. కాంక్రీట్ జంగల్‌లను హరితవనాలుగా చేయాలని సూచించారు. ఏపీవో కవిత, పంచాయతీ కార్యదర్శి సురేందర్‌గౌడ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోల లీడర్లు, హెచ్ఎంలు, టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. గుమ్మడవెల్లిలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కారోబార్ శంకర్, అంగన్వాడీ టీచర్, మాజీ వార్డు మెంబర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ప్రజలంతా పర్యావవరణ పరిరక్షణకు కృషిచేయాలని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి కోరారు. మొయినాబాద్ మండలంలో యువజన సంఘాల సభ్యులతో కలిసి మొక్కలు నాటడంపై చర్చించారు. ర్యాలీలు నిర్వహించారు. నాగిరెడ్డిగూడలో డీసీపీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నర్సింహ,



యాచారంలో స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చేవెళ్లలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో సాయిరాం తదితరులు

మనోజ్, జ్ఞానేశ్వర్, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పెంచాలని నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్ అన్నారు. చేగుర్‌లో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనంలో పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ దనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని మొయినాబాద్ మండల ప్రత్యేక అధికారి కె.కిషన్‌రావు, ఎంపీడీవో సంధ్య అన్నారు. చిలుకూరులో వారు పాల్గొన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మొక్కలు నాటుతాం అన్నారు. కేతిరెడ్డిపల్లిలో ర్యాలీ ని ర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకట్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి తారాబాయి, నాయకులు ఆర్.యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ సిద్ధయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొందుర్గు మండల ప్రత్యేకాధికారి రియాజ్ కోరారు. మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయితీ కార్యాలయం ఆవరణలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చెత్తా, చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అమృతా జోసఫ్, ఎంపీవో లాలయ్య, ఏపీఎం జయమాలిని, పంచాయితీ కార్యదర్శి బాబయ్య, ఏపీవో నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం



బాధితులను పరామర్శిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 5 : పదవులున్నా, లేకపోయిన ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాధిత కుటుంబాలకు తోడ్పాటునందిస్తానని పేర్కొన్నారు. కడ్తాలలోని 12, 13 వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. అనారోగ్యానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న మంకి మైసమ్మ, మల్లేశ్, అనసూయ, పెంటయ్య, బాలయ్య, హరిచర్, కృష్ణయ్యలను శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు చికిత్సల నిమిత్తం రూ.20వేల సాయం అందజేశారు. ఎవరూ అధైర్య పడొద్దని, ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, మల్లయ్య, శ్రీను, రాజేశ్, భానుకిరణ్, శ్రీకాంత్, ఇమ్రాన్‌బాబ, వెంకటరమణ, శేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

'కార్యకర్తలకు ఎల్లవేళలా బీఆర్ఎస్ అండ'

శంషాబాద్ రూరల్, ఆగస్టు 5: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళాల అండగా ఉంటుందని సీనియర్ నాయకులు దిద్యాల శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లి, కవ్వగూడ, చౌదర్‌గూడ గ్రామాల్లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఏ ఆపద వచ్చినా పార్టీ పరంగా అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేంత వరకు కలిసికట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మంచర్ల మోహన్‌రావు, నాయకులు కొనమల శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, యూత్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌గౌడ్, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, గ్రామాల నాయకులు కుమార్‌గౌడ్, ప్యాక్స్ డైరెక్టర్ బాల్‌రాజ్, సుధాకర్‌గౌడ్, వీరాచారి, కృష్ణ, ఈశ్వరయ్యగౌడ్, రాజుగౌడ్, ప్రశాంత్, రమేశ్, మహేశ్, రాము, కృష్ణ, నాగేశ్, మురళి, జంగయ్య, నర్సింహ, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజంపై దృష్టి పెట్టాలి

మొయినాబాద్, ఆగస్టు 5 : విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిస్థితులపై దృష్టి పెట్టాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చాన్సలర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండలం పరిధి చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన టీపీ.ప్రసన్నకుమార్‌కు సోమవారం చాన్సలర్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. 'మైక్రోబియల్ ప్రొఫైలింగ్ ఆఫ్ జీవామృతం' అనే అంశంపై ప్రసన్నకుమార్ పరిశోధన చేశారు. చాన్సలర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజ పరిస్థిలను ఆకలింపు చేసుకుంటే పరిశోధనలకు ఉపయోగపడుతుందని సూచించారు. సాధించిన విజ్ఞానాన్ని సమాజ ఉన్నతికి ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో వీసీ దామోదర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, క్రిస్టోఫర్, జగదీశ్వర్, రాజు, అధ్యాప బృందం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరోగ్య శ్రీ కార్డులు : ఎమ్మెల్యే

షాద్‌నగర్, ఆగస్టు 5: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డులు ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ తెలిపారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వైఎస్సార్ హయాంలో చేపట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న 310మందికి రూ.1.22కోట్ల విలువైన ఎల్వోసీలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బాబర్‌ఖాన్, రఘు, బాలరాజుగౌడ్ విశ్వం, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యాప్రమాణాల పెంపునకు చర్యలు'

కడ్తాల, ఆగస్టు 5: ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యాప్రమాణాలు పెంపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్టీ వెల్ఫేర్ సహాయ సంచాలకులు వెంకటయ్య అన్నారు. కడ్తాలలోని ఎస్టీ హాస్టల్‌ను సోమవారం రాత్రి ఏటీడీవో తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను, గదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని డబ్ల్యూవో రాములును ఆదేశించారు.

గుడుంబా నిర్మూలనకు సహకరించాలి

కడ్తాల్, ఆగస్టు 5: గుడుంబా, డ్రగ్స్, గంజాయి రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ కోరారు. సారా నిరోధానికి ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మైసిగండిలో సోమవారం గుడుంబా, గంజాయి, నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ గట్టినిఘా పెట్టిందన్నారు. ఫంక్షన్ హాళ్లు, రిసార్ట్స్, ఫాంహౌజ్‌లలో లిక్కర్ పార్టీలు జరిపితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐలు కృష్ణప్రసాద్, స్వప్న, అరుణ్‌కుమార్, సిబ్బంది, నాయకులు రాందాస్, జవహర్‌లాల్, పంత్యానాయక్, తులసీరామ్ పాల్గొన్నారు.

దళిత మహిళను కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలి

శంషాబాద్ రూరల్/షాద్‌నగర్ రూరల్/షాద్‌నగర్, ఆగస్టు 5: షాద్‌నగర్‌లో దళిత మహిళ సునీతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం శంషాబాద్ పోలీసులకు వినతి పత్రం ఇచ్చారు. మహిళను కొట్టిన సీఐ రాంరెడ్డిని, పోలీసు సిబ్బందిని విధుల నుంచి తప్పించాలన్నారు.దళిత మహిళపై దాష్టీకానికి పాల్పడ్డ షాద్‌నగర్ పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ శ్రీదేవి డిమాండ్ చేశారు. పోలీసుల దెబ్బలకు అనారోగ్యానికి గురై షాద్‌నగర్ ఆసుపత్రిలో ఇకిత్స పొందుతున్న సునీతను ఆమె పరామర్శించారు. దొంగతనం నెపం మోపి సునీతను, ఆమె భర్తను, కుమారుడిని రాత్రి పూట స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టడం సరికాదన్నారు. ఇందుకు బాధ్యులైన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, కానిస్టేబుళ్లపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి రూ.25లక్షలు, పక్కా ఇల్లు, భర్తకు ఉపాధి చూపాలని అన్నారు. ఆమె వెంట షాద్‌నగర్ కమిటీ సభ్యులు కళమ్మ, కవిత, జ్యోతి ఉన్నారు. దళిత మహిళపై పోలీసుల దాడిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ డిమాండ్ చేసింది. పోలీసు ఇంటరాగేషన్‌లో గాయపడిన సునీతను కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, పలువురు ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ దళితుల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సునీత దళితురాలైనందునే ఆమెపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ దొంగతనం నెపంతో మహిళను వివస్త్రను చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డీఐ రామిరెడ్డిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా డిమాండ్ చేసింది. మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకన్నోళ్ల నరసింహ మాట్లాడుతూ రాత్రి వేళలో ఒక మహిళను అరెస్టు చేసి నేరం ఒప్పుకోవాలంటూ ఆమెను విచక్షణా రహితంగా కొట్టడం నేరమన్నారు. పోలీసుల తీరుకు నిరసనగా మోర్చా నాయకులు ధర్నా చేశారు.



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

శంకర్‌పల్లి, ఆగస్టు5: బైక్‌పై నుంచి పడి వివాహిత మహిళ మృతి చెందింది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం అప్పారెడ్డిగూడకు చెందిన చేగూరి నవీన్, తమ్ముడు నరేందర్‌లు కలిసి బైక్‌పై నరేందర్ అత్తగారిల్లు ఊరు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గడిమల్కాపూర్‌కు ఆదివారం వెళ్లారు. అదేరోజు బైకుపై నవీన్, నరేందర్, నరేందర్ భార్య సదా(23)తో కలిసి శంకర్‌పల్లి మీదుగా అప్పారెడ్డిగూడకు బయలుదేరారు. మహాలింగపురం పరిసరాల్లోని సిలికాన్ వెంచర్‌కు రాగానే బైక్ అదుపుతప్పి ముగ్గురూ పడిపోయారు. సదా తలకు గాయాలు కాగా ఆమెను శంకర్‌పల్లిలోని విజయ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి నలగండ్లలోని సిటిజన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. బైక్ నడుపుతున్న నరేందర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్

శంకర్‌పల్లి, ఆగస్టు 5: మోకిలలోని బాలాజీ సెల్‌ఫోన్ షాపులో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించినట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు. మోకిలలోని బాలాజీ సెల్‌ఫోన్ దుకాణంలో జులై 25 రాత్రి దొంగతనం జరిగింది. సుమారు 30సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్, 4.08లక్షల నగదు ఎత్తుకపోయారని చేశారని బాధితుడు జీవన్‌కుమావత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి నగరంలోని లంగర్‌హౌస్‌కు చెందిన మేక దుర్గారెడ్డి, అత్తాపూర్‌నకు చెందిన షేక్ మహబూబ్‌లను ఈ నెల 4న అదుపులోకి తీసుకున్నారు. సోమవారం వారిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.1.20లక్షల నగదు, 14సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్, హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై ఇప్పటికే పలు చోట్ల చోరీ కేసులు ఉన్నాయని వివరించారు.

ట్రాక్టర్, బొలెరో వాహనాల సీజ్

యాచారం, ఆగస్టు 5 : యాచారం, గున్‌గల్, మాల్‌లో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జీవీ.అనూష సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని ట్రాక్టర్, బొలేరొ వాహనాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాల సర్టిఫికెట్లన్నీ వెంట ఉంచుకోవాలన్నారు.

ప్రభుత్వం పంటల బీమాను అమలు చేయాలి

షాబాద్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వెంటనే అమలుచేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి అధ్యక్షతన షాబాద్ రైతు వేదికలో రైతులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ధరణిలో మార్పులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. రైతులకు ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేసినా చాలామందికి మాఫీ కాలేదన్నారు. రేషన్ కార్డు నిబంధన తొలగించి అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సర్వేలకు దరఖాస్తు చేసుకున్న రైతులకు సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామస్వామి, మల్లయ్య, పాండు, శివకుమార్, మల్లేష్, రాంచంద్రయ్య, చంద్రబాబు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువ మోర్చా నూతన కమిటీ ఎన్నిక

కేశంపేట, ఆగస్టు 5 : మండల బీజేపీ యువమోర్చా పూర్తిస్థాయి కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యాలయంలో యువ మోర్చా మండలాధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ అధ్వర్యంలో కమిటీ ఎన్నుకున్నారు. ఉపాధ్యాక్షులుగా కానుగుల మహేష్, గురుప్రసాద్, శివచారి, శ్రీకాంత్, క్రాంతి, ప్రధాన కార్యదర్శులు విగ్నేష్, రాకేష్, కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్, శివకుమార్, విజయరెడ్డి, శివకుమార్, కోశాధికారి రాఘవేంద్రచారి, సోషల్ మీడియా ఇన్చార్జిగా మశ్చేందర్‌లను ఎన్నుకున్నారు.



సంక్షిప్తంగా...

తలకొండపల్లి: గట్టిప్పలపల్లి మాజీ ఎంపీటీసీ ఎండీ అమిదాబి అనారోగ్యంతో మృతిచెందారు. అమిదాబి కుటుంబాన్ని మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. వారు రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు డేవిడ్, ప్రశాంత్‌రెడ్డి, రాజశేఖర్, నరేందర్‌గౌడ్, రాహుల్, పవన్, రాములు, రాజు, జంగయ్య, కృష్ణ య్య, రవీందర్, అనంత రాములు, సైదులు, వెంకటేశ్, మల్లే శ్, కొండల్, సురేశ్, అంజనేయులు ఉన్నారు.

● **శంషాబాద్:**శంషాబాద్ విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గౌతం వివేకానందగుప్తా, ఉపాధ్యక్షులుగా నర్సింహ, రాజు, కార్యదర్శిగా సురేష్, ఉప కార్యదర్శులుగా రామాంజనేయులు నియమితులయ్యారని జిల్లాకోషాధికారి నర్సింహ తెలిపారు.

● **మొయినాబాద్:** భాస్కర ఆసుపత్రి యాజమాన్యం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడదని, ఇలాంటి ఆరోపణలు నిరాధారమైనవని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నట్లు విద్యార్థులు తమకు ఎలాంటి సర్టిఫికెట్లు ఇవ్వలేదని తెలిపారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు భావ్యం కాదని పేర్కొన్నారు.

మాడ్గుల: రేషన్ డీలర్లు బియ్యం ప్రజలకు పంచకుండా పక్కదారి పట్టిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని ఎన్ఫోర్స్ మెంట్ డీటీ రఘునందన్ అన్నారు. మండలంలోని గ్రామాల్లో రేషన్ షాపులను పరిశీలించారు. కొందరు డీలర్లు బయోమెట్రిక్ యంత్రాలను ఇష్టానుసారం వాడుతున్నట్టు తేలిందని, అక్రమాలకు పాల్పడితే డీలర్‌షిప్ రద్దు చేస్తామన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదన సరైంది కాదని ఇబ్రహీంపట్నం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసునూరి వినోద్‌కుమార్ గుప్త అన్నారు. పొట్టి శ్రీరాములు పేరు మార్చితే ఆర్యవైశ్యులంతా సంఘటితమై ఉద్యమం లేవదీస్తామని ఆయన అన్నారు.

● **నందిగామ:** మండల పరిధి పృథ్వీ కాలనీలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి అంతిరెడ్డిగూడకు చెందిన తుమ్మల నర్సింలు లక్షన్నర విరాళం ఇచ్చారు. ఆలయ గదుల నిర్మాణానికి ఆయన, కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బాల్‌రాజ్, సుధాకర్, చందు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి:** ఖానాపూర్ శివారులో గల ప్రభుత్వ భూమిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, చౌదర్‌పల్లిలో మూడు దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ హాజరయ్యారు. ధర్నా అనంతరం తహసీల్దార్ రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్‌లోని సర్వే నంబర్లు 16, 18, 20లలో 24.20ఎకరాల అసైన్డ్ భూమిని గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆర్ఓఆర్ రికార్డుల్లో నమోదు చేసుకున్నారన్నారు. ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తీసి పట్టాభూమిగా మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారని తెలిపారు.

● **మహేశ్వరం:** కేరళ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతీ ఒక్కరు తోచిన సహకారం అందించేందుకు ముందుకు రావాలని ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి బి.దత్తునాయక్ అన్నారు. సోమవారం మహేశ్వరంలో విరాలాల సేకరణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మునుపెన్నడు లేని విధంగా కేరళలో ప్రకృతి బీభత్సం సృష్టించిందన్నారు. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాదయ్య, బ్రహ్మచారి, రాములు, దేవెందర్, రాజు తధితరులు పాల్గొన్నారు.

● **కొందుర్గు:** మండల పరిధిలోని టేకులపల్లి-ఉత్రాస్‌పల్లి మధ్యన ఉన్న వంతెనను పంచాయితీరాజ్ శాఖ అధికారులు పరిశీలించారు. రెండు గ్రామాల మధ్యన ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి, వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రెండు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తేవడంతో.. పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏఈ తేజలు వంతెనను పరిశీలించారు. మండల పరిధిలోని రాంచంద్రాపూర్ నుంచి రేగడి చిల్కమర్రి వరకు మిగిలిపోయిన బీటీ రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలించారు.